# ఆటబొమ్మ.

★

శ్రీమతి చుండూరి రమాదేవిగారు.

పూర్వజన్మ సుకృతం వల్ల సంతానం కలుగుతుందంటారు గాని నా పాలిటికి దుష్కృతమే అయింది. సిరిగల వారికి సంతాన సౌఖ్యం ఆనందం. నావంటి దీనురాలికి, పూటకు గతిలేనిదానికి సంతానమెందుకు! ఆ మాయదారి దేముడికి మతిపోయిందేమో కాని, పిల్లలు కావాలని పరితపించే శ్రీమంతులకి, ఎన్ని వ్రతాలు చేసినా, ఎన్ని దానధర్మాలు చేసినా, ఎన్ని తీర్థయాత్రలు చేసినా, తపస్సులు ధారపోసినా ఇవ్వనివాడు; మాబోటి వాళ్లకు అయాచితంగా యిస్తాడు. నాకు ముగ్గురు మొగపిల్లలు ఒక్క ఆడపిల్ల మేము యానాదులం. నేను ఆ పక్క వీధిలో వుండే జమీందారు గారింట్లో పాచిపని చేస్తున్నా. నా పెనిమిటి కూలో నాలో చేసి రోజుకి పావలా డబ్బులు తెస్తుండేవాడు. ఉబ్బు ఖాయిలాతో ఆర్నెల్లు తీసుకుని ఏడాది క్రిందట కాలం చేశాడు. ఆయన జబ్బు మొదలెట్టినప్పటినుంచి నానా తిప్పలు పడుతున్నా నమ్మగారూ. ఆదొరగారిచ్చే మూడు రూపాయిలు ఎల్లా సరిపోతాయి! ఇప్పటికి పన్నెండు రూపాయలప్పైందమ్మా. ఇల్లాంటి స్థితిలో నాబిడ్డలకి ముద్దులు, ముచ్చట్లూ ఎల్లా తీగతాయి. మొన్న మా అమ్మగారు బజారెడుతూ నన్నుకూడా వెంట పెట్టుకెళ్లారు. మానూరి నాలుగేళ్లది వెంటబడ్డది. చంకపెట్టుకొని వెళ్లాను. అమ్మగారు సామాను కొనటమైన తరువాత మా అమ్మాయిగారికి ఆయిదు రూపాలు పెట్టి చక్కని ఆటబొమ్మను కొన్నారు. మానూరి చిన్నపిల్ల అవటంచేత ఆబొమ్మను చూసి మురిసి పోయి 'అమ్మా నాకు కూడా బొమ్మే' అనియేడుపు సాగించింది. ఆబొమ్మను ముట్టుకోటానికి కూడా మాకు తాహతులేదు. గదిమి చంకనేసుకున్నాను. మా అమ్మగారు 'ఈదరిద్రపు ముండను ఎందుకు తీసుకొచ్చావే' అనివిసుక్కున్నారు. నాకు చచ్చినచావైంది. ఇంటికొచ్చినకాడ నుంచీ మానూరి ఒకటేగోల. "అమ్మా, బొమ్మ, అమ్మా, బొమ్మ," యిదేజపం. రాత్రికి జ్వరం తగిలింది. మొన్నటినుంచి మూసిన కన్ను తెరవదు. అమ్మాయిగారు, బొమ్మ, అవేకలవరింతలు. నిన్న ఏమైనాసరే మా అమ్మగార్ని ఒక్కసారి బొమ్మ అడుగుదామని వెళ్లాను. కాని అడగటానికి గుండెలేదు. పిల్లబాధచూడలేను. చివరికి ధైర్యంచేసి "అమ్మా పిల్లకి మూడురోజుల నుంచిజ్వరం, బొమ్మకోసం పలవరిస్తోంది. ఒక్కసారి బొమ్మయిస్తే మళ్లీజాగర్తగా వప్పజెపుతానమ్మా" అన్నాను. నామాటలు వింటూనే ఉగ్రరూపం ధరించిందాతల్లి. "దరిద్రపుముండా! నీబతుక్కి బొమ్మేతక్కువైంది. మూణ్ణాళ్లనుంచి పని ఎగ్గొట్టిందేగాకుండా మాటలుచెపుతున్నావ్, నీపనిమాకవసరంలేదు. యికమా గుమ్మంతొక్కద్దు" అని ఏమేమో తిట్టిపోశారు. నీపని మాకవసరం లేదనే ముక్క చెవినిబడే సరికి నీరైపోయాను. ఇంకా ఆయమ్మ ఏమేమన్నదో వినిపించలేదు. ఇంటికెళ్లేటప్పటికి పిల్లస్థితి బాగుండలేదు. ఇది నాస్థితి. అమ్మగారు జాలిగుండె కలవారు. మంచివారు. పేదసాదలను దయతో చూస్తారు. ఆయనది అమృతహస్తమనివిని ఆశతో వచ్చా. అమ్మా నన్ను కరుణించి అయ్యగార్ని పిల్లనుచూసి రెండు పొట్లాలిమ్మని చెప్పండమ్మ. మీకాళ్లకి మొక్కుతా

నమ్మా, అంటూ చేతులు జోడించింది ఆ అమ్మ. నాహృదయం ద్రవించి పోయింది. వెంటనే మావారిని లేపి విషయం చెప్పాను. వారుకూడా దయార్ద్ర హృదయులు కాబట్టి బద్ధకించకుండా ఆయెండలోనే బయలు దేరారు. నౌఖరు చేతికి బేగ్ రూ 5 లు ఇచ్చి ఈపిల్లకు ఒకబొమ్మ కొనియిచ్చి రమ్మని చెప్పిపంపాను. పదినిమిషాకల్లా వెళ్లినవారు వెళ్లినట్లే తిరిగి వచ్చారు. బొమ్మ బొమ్మ అంటూ ప్రాణాలు విడిచిందట ఆపిల్ల.

భగవానుడు సర్వాంతర్యామి, ఆశ్రితమందారుడు. ఆయనకు, సర్వజీవుల యందు సమత్వమే నంటారు! ఆపక్షపాతమెందుకో! ఒకరికి హంసతూలికా తల్పాలు, ఒకరికి ఆకటిక నేల. ఒకరికి రమ్యహర్మ్యాలు, ఒకరికి చుట్టుగుడిశలు, కొందరికి షడ్రసోపేత భోజనము, కొందరికి గంజినీళ్లకే కరువు. ఇన్ని సౌఖ్యాలు కల్పించి వారికి పాషాణా సదృశహృదయాలను కూడా కల్పించాడు. ఒక్కసారి బొమ్మయిస్తే ఆఅమ్మ సొమ్మేం పోయింది? మనమింతే పెట్టిపుట్టామని తృప్తికల్పించుకోటానికి తగిన వయసుకాదా పిల్లది. కోరిక ప్రతిజీవికి సహజమే, ఆ అమాయక పసినిసుగుకు తీరనికోరికై పోయింది ఆబొమ్మ.

—(0)—

## శ్రీ కాశీశ్వరరావుగారి బిల్లు

శ్రీ కాశీశ్వరావుపంతులుగారి కొత్తబిల్లు, బహుభార్యా భర్తృత్వముల నిషేధించి, వివాహముల రద్దున కనుమతిచ్చుచుండుట వలన చాలా ఉపయోగముగ నున్నది. అంతమాత్రము చేత ప్రతిస్త్రీ, పురుషుడు "విడాకులు" కోరుదురనుకొనుట హాస్యాస్పదము ఏదైనా చట్టరూపమున నున్నప్పుడే దానివిలువ తెలిసి యుండును. ప్రస్తుత కాలానుసారముగ సదరుబిల్లు ప్రజలకెంతయేని యుపయోగ పడగలదు. ఈబిల్లువలన చీటికి, మాటికి, కొట్టి, తిట్టుభర్తల నడవడిక కొంతతగ్గుతుందని కూడా నమ్మకమున్నది. గాన, శ్రీ కాశీశ్వరావుపంతులుగారి బిల్లు తప్పక శాసన సభలో ప్యాసుకావలెనని, నా అభిప్రాయమును వెల్లడించుచున్నాను.

అయ్యదేవర బాలా త్రిపుర సుందరమ్మ.

## విజ్ఞప్తి

'గృహలక్ష్మి' యందలి రచయితల చిత్రపటములు ప్రచురింపుడని పలువురు కోరుచున్నారు. ఆకోరిక మాకెదివరకేగల అభిలాషను ఇనుమడింప చేసినది. కాన క్లుప్తమగు తమ చరిత్రలతోపాటు చిత్రపటములనుగూడ రచయితలు మాకంపగోరెదము.

సంపాదకుడు.